



ఆకాశ మధ్యాన వ్రేలాడుతున్న వెండిదీపాల గుత్తిలా అద్భుతంగా వెలిగిపోతున్నాడు పున్నమి చంద్రుడు. వనకన్యల విరహవేదనంతా మోసుకొస్తున్నట్లుగా మందంగా వీస్తోంది పిల్లగాలి.

కిటికీలోంచి పండువెన్నెల జాలువారుతోందా గదిలోకి.

నిద్రపోవడానికి ప్రయత్నిస్తున్నట్లుగా, పడకమీద అసహనంగా కదులుతున్నాడు శరత్. అయినాసరే...నిద్రాదేవత అతన్ని కరుణించడం లేదు.

పక్కకు వత్తిగిల్లి, భార్య వైపు చూశాడు.

ప్రశాంతంగా నిద్రపోతోంది రాగిణి. అలసి సొలసి నిద్రిస్తున్న ఆమె వాడిన మల్లెదండలా ఉంది.

పాలిపోయిన చెక్కిళ్లు, లోతుకుపోయిన కన్నులు.. 'చక్కనమ్మ చిక్కినా అందమే' అన్నట్లు నీరసంగా ఉన్నాకూడా ఆమెలో వింత సౌందర్యం.

ఆమె.. రోజుకో కళ చొప్పున చేరుతూ.. పదునారుకళలను తన సొంతం చేసుకున్న నెలరాజులా నిండుగా అనిపించేది.

తమ తియ్యని కలలకు ప్రతిరూపంగా అందాల వర్ష ఉదయించింది.

డెలివరీ టైమ్‌లో.. ఆ తరువాత ఏర్పడిన అధిక రక్తస్రావం వలన రాగిణికి అనీమియా ఏర్పడింది. దాని మూలాన ఆమె నరాల బలహీనతకు గురి అయ్యింది. ఫలితం గత నాలుగు నెలలుగా తామిద్దరూ సంసార జీవితానికి దూరం అయ్యారు.

కనీసం... కన్నబిడ్డని తనంత తానుగా గుండెలకి హత్తుకునే పాటి శక్తి కూడా లేదామెకు.

పాపాయికి భూమ్మీద పడిన మరుక్షణం నుండి పోత పాలే.

మొదట్లో రాగిణికి మేనత్త వరుసైన ఆమె ఒకరు వచ్చి, ఓ రెణ్ణెల్ల పాటు సేవ చేశారు. కాని..ఎవరు మాత్రం తమ పనులను ఎన్నాళ్లని వాయిదా వేసుకుంటారు? పుట్టింట్లోనే కొన్నాళ్లు ఉంచుదామంటే రాగిణి తల్లిలేని పిల్లాయె. అన్న, వదినలు పురుడు పోసి పంపించేసి, తమ బాధ్యత తీరిపోయిందని చేతులు దులిపేసుకున్నారు.

అందుకే తల్లి, పిల్లల సంరక్షణ భారం వహించడానికి ఓ ఆయాను ఏర్పాటు చేశాడు. సాయంత్రం అతడు ఆఫీసు నుండి వచ్చేవరకు ఆమే వారిద్దరినీ చూసుకుంటుంది.

రాగిణి కోలుకోవడానికింకా కొన్నాళ్లు టైమ్ పడ్తుందని డ్యాక్టర్స్ చెప్పారు. అది రోజులైనా కావచ్చు. నెలలైనా కావచ్చు.

ఆలోచనల్తో కొట్టుకుంటున్న శరత్, వర్ష గుక్కపెట్టి ఏడవడంతో ఈ లోకంలోకి వచ్చాడు.

ప్రక్క తడుపుకుందేమో బహుశా...

నీరసం మూలాన, ప్రక్కనే ఏడుస్తున్న పాప ఏడుపు కూడా వినబడనంత గాఢంగా నిద్రపోతోంది రాగిణి.

లేచి పాపాయి పొత్తిగుడ్డలు మార్చి.. ఒళ్లంతా బేబీ ఆయిల్ రాసి.. ఉయ్యాల్లో వేశాడు శరత్. ఇంకా ఏడుపాపలేదు వర్ష.

ఆకలేస్తోందేమో..

లేచి కిచెన్‌లోకి వెళ్లి, గిన్నెలో పాలు పోసి వేడిచేశాడు. బాటిల్‌లో పోసి పాప నోటికి అందించాడు.

అవి త్రాగేసి మరికాస్సేపటికి నిద్రలోకి జారు

# అనురాగిణి


ఆమెనోసారి పరీక్షగా చూసి.. 'ఎలాంటి రాగిణి.. ఎలా అయిపోయింది.. ఒక ప్రవాహంలా.. తుళ్లిపడే సెలయేటిలా, ఎగిసిపడే రాగిణి.. ఇలా.. జబ్బు మనిషిలా..' శరత్ హృదయం భారమయ్యింది.

తను, రాగిణి.. ఎన్ని పున్నమి రాత్రులు గడిపారు.. ఎన్ని కమ్మని అనుభూతుల్ని సొంతం చేసుకున్నారు! కాని..కాలానికి కన్ను కుట్టింది.

గత స్మృతులనీ.. పచ్చని అనుభవాలని నింపుకొని గడిచిపోయిన కాలాన్ని.. నెమరువేసుకుంటే గుండెల్ని ఎవరో పిండినట్లుగా అయ్యింది శరత్‌కి.

తను ఎంతో పొంగిపోయాడు, రాగిణి ప్రెగ్నెంట్ అని తెలిసినప్పుడు.

నెలలు నిండుతూ భారంగా కదిలే



కె.కె. భాగ్యశ్రీ

కుంది పాప.

ఎందుకో..నిద్రలోనే బోసినవ్వులు చిందిస్తోంది వర్ష. అచ్చం రాగిణి పోలికే.. గుండ్రని ముఖం, మీన నేత్రాలు.. పెద్దయితే రాగిణిని మించిన అందగత్తె అవుతుంది. అందులో సందేహం లేదు.

అటుపైన ఇంకాసేపు ప్రయత్నించాడు శరత్ నిద్రపోవడానికి. అయినా కునుకు రాలేదు కంటిమీదకి. ''శరీరం..ఏదో అనుభవాన్ని కాంక్షిస్తోంది..కానీ..ఎలా?''

రాత్రిలో మూడవ భాగం కూడా గడిచాక.. అప్పుడు వరించింది నిద్రాదేవత.

★ ★ ★

ఎర్రబడ్డ శరత్ కన్నులను చూసి ''ఏం బ్రదర్..రాత్రంతా నిద్రలేదా? ఏంటి సంగతి?'' కొంటెగా కన్నుగీటి అడిగాడు అతడి కొలీగ్ సంతోష్.

సమాధానంగా నవ్వేసి ఊరుకున్నాడు శరత్.

''అదుగో..ఏమడిగినా నవ్వేనా! విషయం చెప్పు..'' రెట్టించాడు సంతోష్.

''చెప్పడానికి ఏముంది? రాత్రంతా పాప అల్లరి చేస్తూనే ఉంది. అందుకే నిద్రలేదు''

''అదా..నేనింకా ఏమో అనుకున్నాలే..'' నిరుత్సాహంగా అన్నాడు సంతోష్.

''నువ్వూహించినది ఏమీ కాదులే..రాగిణి ఇంకా కోలుకోలేదు'' నిర్లిప్తంగా చెప్పాడు శరత్.

''ఇలా..నాతి గల బ్రహ్మచర్యం ఎన్నాళ్లు.. నీకు చికాగ్గా లేదూ..'' ప్రశ్నించాడు సంతోష్.

''ఉంది..కానీ ఎలా? ఇంకొన్నాళ్లవరకు రాగిణికి ఎటువంటి ఇబ్బంది కలిగించకూడదు..'' సమాధానమిచ్చాడు శరత్.

అతడు, సంతోష్ క్లోజ్ ఫ్రెండ్స్. ఏ దాపరికం ఉండదు వారిరువురి మధ్య.

''ఏంటి బ్రదర్..ఎలిమెంటరీ స్కూలు పిల్లాడిలా ఆ అమాయకత్వం. రాగిణికి ఒంట్లో బాగా లేకపోతేనేం..కోరిక తీర్చుకునే దారులు చాలా ఉన్నాయ్..''

''సారీరా! అలాంటి పాడు ఆలోచనలు నా ముందు ప్రస్తావించద్దు. నా రాగిణికి అన్యాయం చేయను..చేయలేను..'' నిక్కచ్చిగా చెప్పాడు శరత్.

''ఇందులో అన్యాయం ఏముందిరా? ప్రతిజీవికి ఆహారం, నిద్ర, భయం, మైథునాలు సహజంగా కలిగేవే..ప్రకృతిపరంగా కలిగే వాంఛల్ని అణగదొక్కుకుంటే కొన్నాళ్లకి నువ్వే పేషెంటువయిపోగలవు. నోడౌట్. అందుకే నామాట విను..'' అతనికి బ్రెయిన్ వాష్ చేశాడు సంతోష్.

అతడి మాటలకు ఆలోచనలో పడ్డాడు. 'నిజమే..ఇందులో తను రాగిణికి చేసే చెరుపేముంది? జస్ట్..తన శారీరక వాంఛను తీర్చుకుంటాడు..దట్సాల్..'

అతడిలో అంతస్సంఘర్షణ ప్రారంభమైంది. ''నాకెందుకో భయంగా ఉందిరా..అసలే ఎయిడ్స్ రోగం ఎక్కువగా వ్యాపిస్తోంది. రెండు క్షణాల సుఖం కోసం జీవితాన్ని బలిపెట్టడానికి నా మనసు అంగీకరించటం లేదు..'' అన్నాడు.

శరత్ మనసు ద్వైదీభావంతో సతమతమవుతోంది.

''అలాంటి భయాలేం పెట్టుకోకురా..నీకు నేనొక అడ్రస్ ఇస్తాను. ఆ అమ్మాయి చాలా కాస్ట్లీ..అన్ని జాగ్రత్తలూ తీసుకుంటుంది. అందువలన ఏ రిస్కూ ఉండదు. హ్యాపీగా ఎంజాయ్ చేయి..'' అని భుజం తట్టాడు సంతోష్.

మనసు, శరీరాన్ని సుఖపెట్టుకోమని ప్రేరేపించడంతో శరత్ ఆమోదం తెలిపాడు.

''దట్స్‌గుడ్..ఇదిగో ఆమె అడ్రస్. ఆల్ ది బెస్ట్'' అంటూ జేబులోంచి కార్డ్ తీసి ఇచ్చాడు సంతోష్.

★ ★ ★

ఇంటికెళ్తూనే ఆయాతో చెప్పాడు శరత్ ''సుమతీ..ఈ రాత్రి నువ్విక్కడే ఉండు. నాకు కొంచెం పని ఉంది.. లేట్ కావచ్చు. అమ్మగారిని, పాపని కాస్త కనిపెట్టు..''

ఆమె సరేనంది.

''రాగిణీ డియర్..ఈ నైట్‌కి నేను ఒక ఫ్రెండ్ మ్యారేజ్‌కి అటెండ్ కావాల్సి ఉంది. వచ్చేసరికి ఆలస్యం అవుతుంది. అందుకే సుమతిని సాయంగా ఉండమన్నాను. నే వెళ్లిరానా..'' అడిగాడు శరత్ ఆప్యాయంగా.

చిన్నగా నవ్వింది ఆమె. బుగ్గల మీద సొట్టలు పడి ఎంతో రమణీయంగా ఉంది అప్పుడు.

శుభ్రంగా స్నానం చేసి తెల్లని లాల్చీ, పైజమా ధరించాడు శరత్. డెనిమ్ కొలోన్ టాల్క్ ఒళ్లంతా రాసుకొని, మంచి పెర్‌ఫ్యూమ్ స్ప్రే చేసుకున్నాడు.

అద్దంలో తనని తాను పరికించుకున్న శరత్ అచ్చు పెళ్లికాని కుర్రాడిలా ఫీలయ్యాడు.

''ఎక్కువసేపు బయట తిరక్కండి. చలిగాలికి రొంప పట్టుంది..'' ప్రేమగా చెప్పింది రాగిణి.

ఆమె కంఠంలో ధ్వనించిన అనురాగానికి క్షణకాలం విచలితుడైనాడు శరత్. 'తాను లేవలేని స్థితిలో ఉండి కూడా, తనకి జాగ్రత్తలు చెప్తోంది. ఈ అమృతమూర్తికా తను అన్యాయం చేస్తోంది' అన్న భావన అతనిలో లిప్తపాటు కదిలి మాయమైంది.


అతడిలో కలిగిన అపరాధ భావనను, వాంఛ అధిగమించింది.


''వస్తా..రాగిణీ..'' ఆమె కళ్లల్లోకి చూసే ధైర్యం చేయలేక తలదించుకు చెప్పేసి బయటపడ్డాడు.

★ ★ ★

## వెరైటీ అంటే..

సినిమాల్లోకి ఎందుకొచ్చావు అంటే చాలామంది తారలు కాకతాళీయంగా వచ్చానని కాకమ్మ కబుర్లు చెబుతుంటారు అయితే సెక్సీ తారగా పేరు తెచ్చుకున్న అంత్రా మాలి 'నటనకే నా ప్రాధాన్యం. నటించడం అనేది నా రక్తంలో ఉంది. అందుకే నేను మిగతావాటికి అంతగా ప్రాధాన్యత ఇవ్వను. నా వ్యక్తిత్వాన్ని కాపాడుకుంటూ మంచి సినిమాల్ని ఎంపికచేసుకుని నటిస్తున్నాను' అని చెబుతోంది. వెరైటీగా నటించడం అంటేనే తనకెంతో ఇష్టం అని చెప్పే అంత్రామాలి నాచ్‌లో హాట్ సీన్స్‌లో దర్శనం ఇస్తోంది. వెరైటీ అంటే ఇదేనేమో!






'బృందావన్ అపార్ట్‌మెంట్స్' ముందాగి ఫ్లాట్ నంబరు చూశాడు శరత్.

''ఫ్లాట్ నంబరు మూడు వందల ముప్పై తొమ్మిది''

వాచ్‌మెన్‌ని కనుక్కుంటే ఆ ఫ్లాట్ థర్డ్ ఫ్లోర్‌లో ఉందని చెప్పాడు.

మెట్లన్నీ ఎక్కి మూడో అంతస్తుకి చేరుకున్నాడు శరత్. ఒక్కో ఫ్లాట్ ముందాగి నంబరు చూసుకుంటూ నడుస్తున్నాడు.

అప్పటికే బాగా ప్రొద్దుపోయింది. పుష్య మాసపు శీతగాలి వేగంగా వీస్తూ చాచికొడుతోంది.

ఫ్లాట్ నంబరు సరిచూసుకొని కాలింగ్ బెల్ మ్రోగించబోయి ఆగిపోయాడు శరత్....ఎందుకో అతడి మనసు మొరాయిస్తోంది.

ఇన్ని మెట్లెక్కి తను వచ్చింది అమర సుఖాల్లో తేలియాడడానికా!? లేక అథఃపాతాళానికి దిగజారిపోవడానికా!?

అంతులేని అంతర్మథనం ప్రారంభమైంది అతడిలో.

మనోఫలకం మీద రాగిణి మనోహర చిత్రం ప్రత్యక్షమైంది.

తను బతిమలాడేకొద్దీ.. మరింత ముడుచుకుపోతూ.. తను అలిగితే.. సిగ్గు, బిడియాలను ప్రక్కకు నెట్టి తనను అలరించిన ప్రేమదేవత ఆమె.

ఎంత వద్దనుకున్నా...తనను వెంటాడుతూనే ఉన్నాయి ఆమె జ్ఞాపకాలు.

శరత్ శరీరమంతా మంచుముక్కలా చల్లబడింది. మనస్సంతా నిర్వికారంగా మారింది.

తలుపు తట్టకుండానే..వెనక్కు మరలాడతను.

రెండేసి మెట్ల చొప్పున దిగుతూ స్పీడ్‌గా క్రిందికి వచ్చిపడ్డాడు.

ఆయాసంతో గుండెలు దడదడమన్నాయి.

అపార్ట్‌మెంట్స్‌కి సమీపంలో ఉన్న పార్క్‌లోకి వెళ్ళి సిమ్మెంట్ బెంచ్ మీద కూర్చున్నాడు శరత్.

ఇంతకీ నెర్వస్ వీక్‌నెస్ రాగిణికా..తనకా?! అదే తనలాంటి పరిస్థితి రాగిణికే ఎదురైతే...ఆమె ఏం చేసేది? తనలాగే ఆనందాన్ని బయట వెతుక్కునేందుకు ప్రయత్నించేదా!

నో..నెవర్..తన రాగిణి ఎన్నటికీ అలా చేయదు.

పెళ్ళయిన క్రొత్తలో..తను హెపటైటిస్ బి వైరస్ సోకి బాధపడితే...పగలనక, రాత్రనక తనకు సేవ చేసి, తన ఒంట్లో ఆరోగ్యం చక్కబడేవరకు ఓపిగ్గా తన కోసం వెయిట్ చేసిన రాగిణికి తనెంత ద్రోహం చేయబోయాడు!?

అంత చలిలోనూ ఒళ్ళంతా చెమటలు పట్టింది శరత్‌కి.

మెదడులో అనేక ఆలోచనలు కలగాపులగంగా రేగుతున్నాయి.

అసలు..రాగిణి తనకేనాడూ ఏదీ తక్కువ చేయలేదు.

'కార్యేషు దాసి.. కరణేషు మంత్రి.. భోజ్యేషు మాతా.. శయనేషు రంభా...' అన్నట్లుగా..అన్ని పాత్రలూ సక్రమంగా పోషించింది.

తన ముచ్చట్లు తీర్చి..మురిపించింది.

తన సుందర దేహాన్ని వేదికగా చేసి..శృంగార రస నాట్య డోలలూగించిన రసరాగిణి ఆమె. తన అణువణువున నిండిపోయిన అనురాగమూర్తి ఆమె.

అలాంటి స్త్రీమూర్తికి తను చేయబోయిన ద్రోహం..ఎంత భయంకరం! చేసిన పాపం చెబితే పోతుందంటారు..అవును తను చేయాలనుకుని మానేసిన నేరాన్ని ఆమె ముందు ఒప్పుకోవాలి. అప్పుడే తన పాపానికి నిష్కృతి.

ఇలా ఆలోచించాక శరత్ హృదయం తేలికపడింది.

★ ★ ★

ఇల్లు చేరిన శరత్‌ని ''భోజనం చేస్తారా?'' అని అడిగింది ఆయా. ఆకలిగా లేదని చెప్పి బెడ్‌రూమ్‌లోకి నడిచాడు శరత్.

బెడ్‌మీద దిండుకు జారబడి ఏదో మ్యాగజైన్ చదువుతోంది రాగిణి.

అతడిని చూసి ''అప్పుడే వచ్చేశారేంటి? లేటవు

## సోనాలీ లైఫ్‌స్టయిల్

**ఎప్పుడూ సింపుల్‌గా కన్పించే సోనాలీబెంద్రేకి అలాంటి లైఫ్ స్టయిల్ అంటేనే ఇష్టంట. ఏదైనా సింపుల్‌గా ఉంటేనే బాగుంటుంది అని బాగా నమ్మే సోనాలీబెంద్రే 'సినిమాల్లో నటించినప్పుడు ఆ సీన్స్‌కి తగ్గట్టుగా డ్రెస్‌లు ఎంపికచేసుకుంటాం. సినిమా వేరు నిత్య జీవితం వేరు కాబట్టి సాధారణ జీవితానికి తగ్గట్టుగా మన వస్త్రధారణ ఉండాలి. మధ్యతరగతి నుంచి వచ్చిన నేను ఈ సూత్రాన్నే బాగా అమలుచేస్తుంటాను' అని నవ్వుతూ చెబుతోంది.**





# ఆధునిక దంత వైద్యం

**డా॥ సుమలత పార్థసారథి,**
కాస్మటిక్ డెంటల్ స్పెషలిస్ట్

## స్మయిల్ డిజైనింగ్‌తో అందమైన చిరునవ్వు మీ సొంతం

అందమైన చిరునవ్వు తోడుంటే గెలవలేనిది ఈ ప్రపంచంలో లేదంటాడో మానసిక వైద్యుడు! మొదటి చూపులో ఎదుటివారికి కనిపించేది, ఓ అభిప్రాయాన్ని కల్పించేది మన చిరునవ్వే! అలాగంటే ఈపోటీప్రపంచంలో ప్రతి ఒక్కటి చిరునవ్వుతోనే ప్రారంభమౌతుంది. చాలాసార్లు అందంగా నవ్వడం, కనిపించడం అనేవే సక్సస్‌కు, ఫెయిల్యూర్‌కు మధ్య తేడాగా చూస్తాం. అది వ్యక్తిగతంగాను, కెరియర్‌లో కూడా!! సొంతమైన అందమైన చిరునవ్వు మన చుట్టు ప్రపంచాన్ని ఎంతో ప్రభావితం చేస్తుంది.

ఎవరయితే వారి చిరునవ్వుపై పూర్తి విశ్వాసంతో ఉంటారో వీరు పనిలోను, చదువులోను, ఎంతో ఏకాగ్రత చూపగల్గుతారు. దేన్నయినా సాధించగలం అన్న భావనతో ఉంటారు. మరోవైపు మనిషి ఎంత ధృడంగా వున్నా సొగసైన చిరునవ్వు, పలువరస లేకుంటే అంతా వృధాయే! ఆత్మనూన్యతాభావం అడుగడుగునా వీరిని వెనక్కి లాగేస్తుంది. ఇదే జీవితంలో పెద్ద అవరోధంలా కనిపిస్తుంది.

### "స్మైయిల్ డిజైనింగ్" ఇపుడు లేటెస్ట్ !

ఒకప్పుడయితే ఎంతగా ఇబ్బందిపడుతున్నా సర్దుకుపోవాల్సి వచ్చేది.కారణం అపుడు ఆధునిక దంత వైద్యం అందుబాటులో లేకపోవడమే! రోజుకు పదిసార్లు అద్దంలో ముఖం చూసుకునే మనం నిజంగానే మనకున్న



చిరునవ్వు ఆత్మస్థయిర్యాన్నిస్తుందా? మనం మనసులో అనుకుంటున్నట్లుగా సంతృప్తిగా నవ్వగలుగుతున్నామా! అని ప్రశ్నించుకోండి. ఏ మాత్రం అనుమానం కలిగినా స్పెషలిస్టును కలిసి 'స్మైయిల్ డిజైనింగ్' చేయించుకోండి. మీ ముఖంలోని అవకతవకల్ని, మీ చిరునవ్వును పాడుచేస్తున్న అంశాలిన్నింటిని సరిచేసి మీకు పూర్తి సంతృప్తినిచ్చే అందమైన చిరునవ్వును ప్రసాదించే శాస్త్రీయభాగమే 'స్మైయిల్ డిజైనింగ్'. ఇది వారికి, వీరికి అని కాకుండా అందరికి అవసరమే. అలాగే అందమైన చిరునవ్వుకు వయస్సూ అడ్డం కాదు. లేదా కనీసం మీకున్న అందమైన పలువరసను జీవితకాలం కాపాడుకోడానికైనా దంత వైద్యుడి సలహాలు ఎంతో అవసరం.

**పార్థ ఉచిత దంత వైద్యశాల & రీసర్చి సెంటర్**

600/ 44/77, పెద్దకాపు లే ఔట్, తిరుపతి.
ఫోన్: 0877-2250555, 2250105


తుందన్నారుగా!'' అడిగిందాశ్చర్యంగా.

''నన్ను క్షమించు రాగిణీ..నేను నీకు అబద్ధం చెప్పాను. నేను వెళ్లింది పెళ్లికి కాదు..'' లజ్జాభారంతో అవనత శిరస్కుడై చెప్పాడతడు.

''తెలుసు'' కూల్‌గా అంది రాగిణి.

''తెలుసా? ఎలా?'' విభ్రమం శరత్‌లో.

''మొద్దబ్బాయ్ ఇదే మాసం? పుష్యమాసం. అంటే శూన్యమాసం. ఇప్పుడు శుభకార్యాలు చేయడానికి ముహూర్తాలేమీ ఉండవు'' అతని ముక్కుపట్టి ఊపుతూ చల్లగా నవ్విందామె.

''కాని..నేను ఎక్కడికి వెళ్లానో తెలిస్తే నన్ను నువ్వు క్షమించవు..'' కృంగిపోతూ తనెక్కడికి వెళ్లిందీ, తిరిగి ఎందుకొచ్చేసినదీ వివరించి చెప్పాడు శరత్. రాగిణి ముఖం గంభీరంగా మారిందొక్కసారి. అది చూసి శరత్ మది తల్లడిల్లింది.

''కాని..రాగిణీ నేనే తప్పు చేయలేదు..'' సంజాయిషీ ఇస్తున్నట్లుగా ఉందతని స్వరం.

''నాకు తెలుసు. మీరే తప్పు చేయలేదని, చేయలేరని కూడా నేను తెలుసుకోగలను..'' స్థిరంగా చెప్పింది రాగిణి. ''నామీద నీకంత నమ్మకం ఏంటి? ఒకవేళ తప్పు చేసి కూడా నీ ముందు నటిస్తున్నానేమో'' విస్తుపోతూ అడిగాడు శరత్.

''నటనలు, మోసాలు మీవలన కాదు సార్..మీరు అబద్ధం ఆడితే నేను పసిగట్టలేననుకున్నారా...మీ కళ్లు నాకు అన్ని నిజాలు తెలియజెప్తాయి..'' పెదవులు విడీ విడకుండా నవ్వింది రాగిణి.

''రాగిణీ..'' నివ్వెరపోయాడు శరత్. తనమీద ఆమెకున్న అపార విశ్వాసానికి విచలితుడైనాడు.

''మీ అణువణువులోనూ నేనే నిండి ఉన్నాను. ఎక్కడో హృదయపు లోతుల్లో..నాకన్యాయం చేస్తున్నారేమోనన్న ఆవేదనతో, గిల్టీ కాన్షన్స్‌తో మీరా తప్పు చేయలేదు. నిజమేనా!'' మల్లీ వెన్నెల వెదజల్లేలా రాగిణి దరహాసం.

''నిజంగా అంతే రాగిణీ..కోరిక తీర్చుకోవాలని ఆ ఇంటి గుమ్మం వరకు వెళ్లిన మాట వాస్తవం. కాని..తలుపు తట్టబోయేముందు నీ రూపం నా మనసు నావరించుకుంది...అంతే! నేను వెనుదిరిగి వచ్చేశాను'' నిజాయితీగా చెప్పాడు శరత్.

''మీరే కాదు..భార్యని ప్రాణంగా ప్రేమించే ఏ భర్తా క్షణికావేశానికి లొంగిపోడు. మనసా, వాచా, కర్మణా తన జీవిత భాగస్వామిని ఆరాధించే ఏ స్త్రీ కానీ, పురుషుడుగానీ, తన పార్ట్‌నర్‌కి అన్యాయం చేయాలనుకోరు'' సహేతుకంగా చెప్పింది రాగిణి.

ఆమెలోని గొప్పగుణం అదే... ఏ విషయాన్నైనా ఎదుటి మనిషి హృదయానికి హత్తుకొనేలా నెమ్మదిగా బోధపరుస్తుంది.


''కాని రాగిణీ..నేను బయటకు వెళ్లడానికి గల కారణం అర్థమయినా సరే...నన్నెందుకు ఆపలేదు? అసలు..నేనిందుకే వెళ్లానని నువ్వెలా ఊహించావు?'' సదేహంగా అడిగాడు శరత్.

అతడి వైపు ఒక్కసారి చూసి తలదించుకు చెప్పసాగింది రాగిణి ''ఎప్పుడూ అబద్ధం ఆడని మీరు.. ఈవేళ ఇలా చెప్పారంటే...ఇదే కారణమని నేనూహించాను. ఇంక మిమ్మల్ని ఆపడానికి ఎందుకు ప్రయత్నించలేదంటారా! నావలన మీకేవిధమైన సుఖం లేదు..'' ''ఛ..ఛ..నేనెప్పుడూ అలా అనుకోలేదు రాగిణీ..ఇలా ఇంకెప్పుడూ జరగదు. ప్లీజ్ బిలీవ్ మీ..'' అర్థింపుగా అన్నాడు శరత్.

''మీరు అనుకుంటున్నట్లు ఇది నాకు అన్యాయం చేయడం మాత్రం కాదు. ఎన్నాళ్లు? జీవచ్ఛవంలా పడి ఉన్న నాకోసం మీరు అన్ని సుఖ సంతోషాలకి దూరమవగలరు? అందుకే...నేనో నిర్ణయానికి వచ్చాను..'' అంది ఆమె దృఢమైన కంఠస్వరంతో.

''నిర్ణయమా! ఏంటి రాగిణీ..'' కంగారుగా అడిగాడు శరత్.

''నాకు డైవోర్స్ ఇచ్చి..మీరింకెవరినైనా పెళ్లి చేసు




కోండి. నా మూలన మీరు ఇలా నరకం అనుభవిస్తూ నలిగిపోవడం నేను భరించలేకుండా ఉన్నాను..'' గొంతుక బాధతో రుద్ధమైంది రాగిణికి.

కన్నీళ్లు మంచిముత్యాల్లా జలజల రాలిపడ్డాయి ఆమె కన్నుల నుండి.

శరత్ హృదయం విలవిల తన్నుకుంది. ఆమె ఆవేదన చూసి తన చేత్తో ఆమె కన్నీళ్లు మృదువుగా తుడుస్తూ ''ప్లీజ్ రాగిణీ..అంత మాటనకు..అసలే తప్పు చేశానన్న భావనతో కుమిలిపోతున్నాను. ఇంకా నన్ను శిక్షించకు. నీకోసం ఎన్నిరోజులైనా ఇలాగే నిరీక్షిస్తాను. నువ్వు తప్పక ఆరోగ్యవంతురాలివవుతావు. అది నా నమ్మకం. ఇంకెప్పుడూ ఇలా చేయను.

ప్లీజ్ రాగిణీ..మన పాప మీద ఒట్టు..నన్ను నమ్ము రాగిణీ..'' ఆమెను తన గుండెలకు హత్తుకుంటూ ప్రేమగా చెప్పాడు శరత్. అతడి మదిలో నిజాయితీ అతడి వాక్కులలో ప్రతిఫలిస్తోంది.

''మిమ్మల్ని నమ్మకపోతే..నన్ను నేనే నమ్మలేను..'' ఆర్తిగా పలికి అతడి హృదయ పీఠం మీద సేదతీరింది రాగిణి.

☆